సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 21 । అక్టోబర్ । 2022



కాలు జారితే..అంతే

ప్రమాదకర పరిస్థితుల్లో పింజరికొండ గ్రామస్తుల రాకపోకలు IIలో



పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు

- 29 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ IIలో

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు



పాఠశాలలో పిల్లలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ బన్సాల్ IIలో

న్యూస్‌రీల్

ఎంతో శ్రమించి డోలీలో తరలించినా దక్కని ప్రాణం

- అస్వస్థతకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి



గిరి మహిళ సులేమాన్‌ను డోలీలో మోసుకు వస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

అనంతగిరి: తీవ్ర అస్వస్థతకు గురైన మహిళకు వైద్యసేవలందించేందుకు ఎంతో శ్రమపడి డోలీలో గిరిజనులు తరలించినా ప్రయోజనం లేకపోయింది. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలిలావున్నాయి. మండలంలోని పెదకోట పంచాయతీ మారుమూల మద్రేబు గ్రామానికి చెందిన కె.సులేమాన్ (65) అనే గిరిజన మహిళ గురువారం ఛాతీనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురైంది. రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు సాయంతో దాయర్తి మీదుగా గుమ్మంతి వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర డోలీలో కుటుంబసభ్యులు మోసుకొని తీసుకువచ్చారు. అక్కడ నుంచి ఆటోలో పినకోట పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ప్రాణాలు కాపాడేందుకు గ్రామస్తులు, కుటుంబసభ్యుల శ్రమ వృథా అయింది.

వాడవాడలా శ్రీనివాసుని కల్యాణోత్సవాలు

- తిరుపతి డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి
- భక్తులకు చేరువగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు



రాజవొమ్మంగి: గోవిందుడు అందరి వాడు.. అందుకే వాడవాడలా శ్రీనివాసుని కల్యాణోత్సవాలను జరిపిస్తూ శ్రీవారి భక్తుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి ఉండేలా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు రూపొందిస్తున్నామని తిరుపతి డిప్యూటీ కలెక్టర్ (టీటీడీ) జి. విజయలక్ష్మి అన్నారు. గురువారం ఇక్కడికి విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడారు. గురువారం అనకాపల్లిలో శ్రీనివాసుని కల్యాణం వైభవంగా జరిగిందని చెప్పారు. 21వ తేదీన ఐ. పోలవరంలో, 22వ తేదీన రాజవొమ్మంగి మండలం లాగరాయిలో వైభవంగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆమె పేర్కొన్నారు. టీటీడీ సేవలను ముఖ్యంగా మన్యంలో విస్తరిస్తున్నట్టు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు దాదాపు 500 లోతట్టు గ్రామాల్లో వివిధ దేవాలయాలను నిర్మించినట్టు చెప్పారు. నిర్మాణాలు పూర్తయిన ప్రతి చోట శ్రీనివాసుని కళ్యాణం జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ విధంగా ఇప్పటి వరకు 274 కల్యాణాలు జరిపించామన్నారు. ఇందులో భాగంగా బడుగు బలహీనవర్గాల వారు జీవించే కుగ్రామాల్లో ప్రతిచోటా శ్రీనివాసుని కల్యాణం జరిపించి అక్కడి వారికి ఏడుకొండల వేంకటేశ్వరుని ప్రాశస్త్యం గురించి తెలియజేస్తున్నామన్నారు. ఆమెతో పాటు సమరసతా సేవాఫౌండేషన్ ప్రతినిధులు విశ్వనాథరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాపికొండలు షికారుకు సిద్ధం

- బోట్ల తనిఖీ పూర్తి
- వారం రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం
- కలెక్టర్ ఆమోదమే తరువాయి
- టూరిజం శాఖ అధికారుల వెల్లడి



రంపచోడవరం: గోదావరి వరదలతో గత మూడు నెలలుగా నిలిచిపోయిన పాపికొండల పర్యాటకానికి కొద్దిరోజుల్లో గ్రీన్ సిగ్నల్ లభించనుంది. గోదావరికి వరద తగ్గుతుండడంతో పాపికొండలు పర్యాటకాన్ని పట్టాలెక్కించేందుకు ఏపీ పర్యాటక శాఖ కసరత్తు ప్రారంభించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్మించిన కాపర్ డ్యామ్ వద్ద నీటి మట్టం ఆధారంగా పాపికొండలు వెళ్లేందుకు పర్యాటక బోట్లకు అనుమతులు ఇస్తున్నారు. గతంలో చాలా కాలం పాటు నిలిచిపోయిన పాపికొండలు పర్యాటకం తిరిగి ప్రారంభమైన తరువాత ఆంధ్రా, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అనేక మంది పర్యాటకులు పాపికొండల అందాలు తిలకించేందుకు వస్తుంటారు. గోదావరిలో పర్యాటక బోట్లు తిప్పేందుకు ఏపీ టూరిజం, ఇతర శాఖల తనిఖీలు పూర్తయ్యాయి. కొంతకాలం పాపికొండల పర్యాటకం నిలిచిపోయిన తరువాత గత ఏడాది డిసెంబర్ 18న అధికారికంగా పర్యాటకానికి అనుమతులు ఇచ్చారు. పోలవరం కాపర్ డ్యామ్ వద్ద గోదావరి నీటి మట్టం 28 అడుగుల దిగువన ఉన్నంత వరకూ మాత్రమే నదిలో పర్యాటక బోట్లు రవాణాకు అనుమతి ఉంటుంది. నీటిమట్టం అంతకన్నా మించితే పర్యాటకాన్ని నిలిపివేస్తుంటారు.

- ప్రస్తుతం కాపర్ డ్యామ్ వద్ద పర్యాటక బోట్లు గోదావరిలో తిరిగేందుకు అనుకూలమైన నీటిమట్టం ఉంది.
- జూన్ నెలలోనే కాపర్‌డ్యామ్ వద్ద గోదావరి నీటి మట్టం 28 అడుగులకు మించి ప్రవహిస్తుండటంతో ముందుజాగ్రత్త చర్యగా పర్యాటకాన్ని నిలిపివేశారు. అప్పటి నుంచి వరదలు, వర్షాల ప్రభావంతో బోట్లకు అనుమతి లభించలేదు.

ఉపాధిపై ప్రభావం

పర్యాటకంపై ఆధారపడి జీవించే అనేక కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయి. పర్యాటక బోట్ల నిర్వహణ కూడా ఖర్చుతో కూడుకున్న పని కావడంతో బోట్ల యజమానులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరిగి పట్టాలెక్కనుండటంతో ఆయా కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

బోట్లకు ఎన్‌వోసీ జారీ

రాష్ట్ర పర్యాటకశాఖ జీఎం నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి దేవీపట్నం మండలం పోశమ్మ గండి బోట్ పాయింట్ వద్ద 12 బోట్లను, వీఆర్‌పురం మండలంలోని పోచవరం బోట్ పాయింట్ వద్ద 17 బోట్లను తనిఖీ చేశారు. వీటికి ఎన్‌వోసీలను కూడా ఇటీవల జారీ చేశారు.



పాపికొండల పర్యాటక బోటు (ఫైల్)

32 అడుగులకు అనుమతి ఇవ్వాలి

గోదావరిలో నీటి మట్టం 32 అడుగుల లోపు వరకు పర్యాటక బోట్లు నదిలోకి తిరిగేందుకు అనుమతి ఇవ్వాలి. ఈమేరకు ఇరిగేషన్ అధికారులను కోరాం. 30 అడుగుల వరకు అనుమతి ఇచ్చేందుకు వారు సానుకూలంగా ఉన్నారు. మరో కొద్దిరోజుల్లో పాపికొండల పర్యాటకానికి అధికారికంగా అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

–కొత్తా రామ్మోహన్‌రావు, బోట్ యజమానుల సంఘ ప్రతినిధి

అనుకూలంగా నీటిమట్టం

గత మూడు నెలలుగా నిలిచిన పాపికొండలు పర్యాటకం మరో వారం రోజుల్లో తిరిగి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి కలెక్టర్ నుంచి అనమతులు మాత్రమే రావాల్సి ఉంది. పోశమ్మ గండి బోట్ పాయింట్ వద్ద పర్యాటకులు బోట్ ఎక్కేందుకు అనువుగా ఉంటే సరిపోతుంది. కాపర్ డ్యామ్ వద్ద బోట్లు తిరిగేందుకు అనుకూలంగా ఉంది.

–పి నాగరాజు, ఇన్‌చార్జి, టూరిజం కంట్రోల్ రూమ్

పక్షవాతం బాధితులకు ఆధునిక వైద్యం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- కుమాడ గ్రామ సందర్శన
- సేవలపై ఆరా



పక్షవాతం బాధితురాలు కృష్ణమ్మను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: పక్షవాతం బాధితులకు అధునిక వైద్యం అందిస్తామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని కుమాడ పంచాయతీ కేంద్రంలో పక్షవాతం వ్యాధితో గిరిజనులు బాధపడుతుండటంపై పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంపై ఆమె స్పందించారు. గురువారం ఆమె వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. బాధితుల్లో మనోధైర్యం నింపారు. రోజురోజుకు బాధితుల సంఖ్య పెరగడంతో ఆందోళన గురువుతున్నామని, 104 ద్వారా సేవలు పొందుతున్నామని జెడ్పీ చైర్‌పర్సన్‌కు వారు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పక్షవాతం బాధితులను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించి,ఆధునిక వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. కుమాడ గ్రామంలో త్వరలో సదరం శిబిరం ఏర్పాటు చేసి ధ్రువపత్రాల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనివల్ల బాధితులకు పింఛను అందుతుందన్నారు. నాటువైద్యం వాడవద్దని బాధితులకు ఆమె సూచించారు.

గ్రామసచివాలయాల తనిఖీ

మండలంలోని కుమాడ, కర్రిముఖిపుట్టు గ్రామ సచివాలయాలను గురువారం జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పలువురు సచివాలయ సిబ్బంది గైర్హాజరుపై ఆరా తీశారు. బయటకు విధులపై వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని, వీటిని పొందేందుకు ఏంచేయాలనేదానిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు వైద్యాధికారి లీలాప్రసాద్, ఎంపీడీవో కిరణ్‌కుమార్, వైద్యాధికారులు శ్యాంప్రసాద్, ఆశోక్‌సాగర్, సర్పంచ్‌లు ఎం.బంగారమ్మ, ఎస్.భాగ్యవతి, రమేష్, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం: ఏజెన్సీలో మాతా శిశు మరణాల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం పీవో సూరజ్‌గనోరేతో కలిసి జిల్లా, డివిజన్ స్థాయి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి గర్భిణులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వారిని ప్రసవానికి 15 రోజులు మందే ఆస్పత్రికి తరలించాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన తరువాత ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. ప్రతి నెల చింతూరు, రంపచోడవరం మండలాల్లో ప్రసవాల వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిల్లోనే నూరు శాతం ప్రసవాలు జరగాలన్నారు. అందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రానికి రాని చిన్న పిల్లలకు ఇంటికి వెళ్లి ఆహార పదార్థాలు అందించాలన్నారు. పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రిల్లో అన్ని రకాలు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో రక్తపరీక్షలు కోసం ఉపయోగించే కెమికల్స్ కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడీఎంహెచ్‌వోలు పుల్లయ్య, అనూష, సీడీపీవో విజయగౌరి, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

- పోలవరం ముంపు బాధితులందరికీ న్యాయం
- కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, వేదికపై రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా అర్హులైన ప్రతి నిర్వాసితుడికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం పోలవరం ముంపు గిరిజనేతర నిర్వాసితులతో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, పీవో సూరజ్ గనోరేతో కలిసి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోనే భూమికి భూమి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్మాణం చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే గిరిజనేతరులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామన్నారు. చింతూరు డివిజన్ పరిధిలో 2700 ఎకరాలకు సర్వే చేయడం జరిగిందన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సర్వేలన్నీ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ముంపు మండలాల్లోని పోలవరం ప్రాజెక్టు పరిపాలన అధికారితో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో మండల స్థాయి కోర్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపులో అర్హులైన ప్రతీ నిర్వాసితుడికి నిబంధనలు ప్రకారం న్యాయం చేస్తామన్నారు. నిర్వాసితులు ఎవరు ఆధైర్య పడవద్దన్నారు. ఎమ్మెల్యే పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల నిలిచిపోయిన పందిరిమామిడి–చవిటిదిబ్బలు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ నెలలో రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు. చవటిదిబ్బలు రోడ్డు అటవీ అభ్యంతరాలు తొలగిపోయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బందమామిడి–రంప వాగుపై వే బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారభించేందుకు కలెక్టర్ హామీ ఇచ్చిన ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో 30 వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి కొరకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. చింతూరు డివిజన్ రూ. 10 కోట్లు, రంపచోడవరం డివిజన్ రూ. 20 కోట్లు నిధులు మంజూరు అవుతాయన్నారు. వీఆర్ పురం మండలం అన్నవరం బ్రిడ్జికు సంబంధించి మిగిలిన పనులు పూర్తచేస్తారన్నారు. సిరిగిండలపాడు ఆనకట్ట తక్షణ మరమ్మతులకు అంచనాలు రూపొందించి నేరుగా నిధులు కోసం తన సంప్రదించాలని కలెక్టర్ తెలిపారన్నారు. దేవీపట్నం ఎంపీపీ కుంజం మురళీ కలెక్టర్ దృష్టి పలు సమస్యలు తీసుకువెళ్లారు. ముంపులో దేవీపట్నంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు మునిగిపోవడంతో ఇందుకూరుపేటలో కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయం లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. చిన భీంపల్లి, పెదరమణయ్యపేట, డీస్‌పాలెం, తాటివాడ, కొండమొదలు, మామిడివలస గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాల భవనం లేదన్నారు. వెలగపల్లి నుంచి గుంపెనపల్లి వరకు సీతపల్లి వాగుపై వంతెన నిర్మాణంవల్ల నాలుగు పంచాయతీల గిరిజనులకు ఇందుకూరుపేట వచ్చేందుకు 50 కిలోమీటర్లు దూరం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో గ్రామసభ IIలో



బూసిపుట్టులో సభ నిర్వహిస్తున్న అధికారులు

సంఘంగా ఏర్పడి విక్రయిస్తే మంచి ధర

- గిరి రైతులకు అవగాహన కల్పించాలి
- అధికారులకు పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్

చింతపల్లి: గిరి రైతులు పండించిన ఉత్పత్తులను గ్రామాల వారీగా సంఘాలుగా ఏర్పడి అధిక ధరలకు అమ్ముకోవాలని పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా కాఫీ, మిరియాలు, పసుపును వాణిజ్య పరంగా సాగుచేస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు పంటలకు గిట్టుబాటు ధరలు రావాలంటే గ్రామాల వారీగా సంఘాలుగా ఏర్పడి అధిక ధరలు చెల్లిస్తామన్న వారికే విక్రయించాలన్నారు. ఈ దిశగా అధికారులు గిరి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. లంబసింగి ప్రాంతంలో సాగు చేస్తున్న పసుపులో కర్కుమిన్ శాతం అధికంగా ఉన్నందున మంచి ధర పొందే అవకాశం ఉందన్నారు. అధికారులు ఈదిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. గిరిజనులు పండిస్తున్న కాఫీకి మంచి ధర కల్పించాలన్న లక్ష్యంతోనే చింతపల్లిలో ఎకో పల్పింగ్ యూనిట్ ఏర్పాటుచేసినట్టు చెప్పారు. గిరిజన సహకార సంస్థ కూడా ఈ ఏడాది వెయ్యి టన్నుల కాఫీ కొనుగోలుకు చర్యలు చేపడుతున్నట్టు సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి రమేష్, ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి అశోక్ కుమార్, ఏడీఏ జాహ్నవి, హెచ్‌వో బాలకర్ణ, చింతపల్లి , జీకేవీధి ఏవోలు కన్నబాబు, మధుసూదనరావు, హబ్ ఏవో శ్రీనివాసరావు, కాఫీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే తప్పనిసరి

చింతపల్లి రూరల్: భూముల రీసర్వే పనులు తప్పనిసరిగా చేపట్టాలని పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ సూచించారు. మండలంలోని బెన్నవరం పంచాయతీ పెడకొండ, లంబసింగి పంచాయతీలోని లబ్బసింగి కొత్తవీధి, తాజంగి పంచాయతీ మర్రిచెట్టు పాకల గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో భూములను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు రీసర్వే చేయిస్తున్నామన్నారు. ఎన్ని ఎకరాలు ఉన్నాయన్న దానిపై రీసర్వే నివేదికలు అందిస్తే జగన్న శాశ్వత భూహక్కు పథకం అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ గోంవిద్, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

నేడు పవనగిరి క్షేత్రంలో 'సత్య' మాలధారణ

అడ్డతీగల: అన్నవరం సత్యనారాయణస్వామి వారి సత్యదీక్షలు చేపట్టడానికి మాలధారణ కార్యక్రమాన్ని పవనగిరి క్షేత్రంలో శుక్రవారం ప్రారంభించనున్నారు. మాలధారణ చేయనున్న భక్తులచే తొలుత సత్యనారాయణస్వామి వారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి అనంతరం మాలధారణ చేయించడానికి అనువైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. దీక్షా వస్త్రాలు ఇంతకుముందే అందజేయగా మాలలు, పూజా పుస్తకాలు భక్తులకు శుక్రవారం అందజేస్తామని ఆయన తెలిపారు. 21 రోజులు దీక్ష చేపట్టే భక్తులు మొదటి దఫా మాలధారణ శుక్రవారం నిర్వహిస్తామని చెప్పారు. మాలధారణ ఎన్నిసార్లయినా చేపట్టవచ్చని ఆయన తెలిపారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు వచ్చే నెల ఏడు వరకు గడువు

- ఇప్పటివరకు 1859 దరఖాస్తుల స్వీకరణ
- డీఆర్వో దయానిధి

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటు నమోదుకు వచ్చే నెల ఏడవ తేదీ వరకు గడువు ఉందని పాడేరు డీఆర్వో దయానిధి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెంటనే నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటి వరకు ఓటు నమోదుకు 1859 దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఆన్‌లైన్‌లో 1637,ఆఫ్‌లైన్‌లో 222 దరఖాస్తులు అందాయని ఆయన పేర్కొన్నారు. ఫారం 18ను నింపి, డిగ్రీ ఉత్తీర్ణత ధ్రువపత్రం, నివాస ఆధార జెరాక్స్ కాపీలను జతపరచి దరఖాస్తులు అందజేసి రశీదు పొందాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈవోఏఎన్‌డీహెచ్‌ఆర్ఏ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

కాలు జారితే..అంతే

ప్రమాదకర పరిస్థితుల్లో పింజరికొండ గ్రామస్తుల రాకపోకలు



నీటి ప్రవాహంలో ఇద్దరు బిడ్డలతో భార్యను తోడ్కొని వెళ్తున్న భర్త

అడ్డతీగల: ప్రత్యామ్నాయం లేకపోవడంతో గత్యంతరం లేక మండలంలోని పింజరికొండ గ్రామస్తులు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఏలేరు వాగులో గల గోడపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. 400 మంది జనాభా ఉన్న ఈ గ్రామం వాగుకు అవతలి వైపు ఉంది. 2010 వరకూ వాగులో ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకునే వారు. వాగుకు సమీపంలో చిన్నతరహా జలవిద్యుత్‌కేంద్రం నిర్మించారు. అక్కడ విద్యుత్ ఉత్పత్తి చేయడం కోసం నీటిని మళ్లించడానికి వాగుకు అడ్డంగా వియర్(అడ్డుగోడ) నిర్మించారు. ఇప్పుడా గోడమీద నుంచి పింజరికొండ గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం నీటి ప్రవాహం ఉండడంతో గోడ నాచుపట్టి ఉంటుంది. ప్రవాహ ఉధృతి అధికంగా ఉన్నప్పుడు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గోడపై నుంచి రాకపోకలు సాగించవలసి వస్తోంది. ఈ క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకోవడం పరిపాటిగా మారింది.



పిల్లా పాపలతో ప్రయాణం

పలువురు మృత్యువాత పడ్డారు. వాగు దాటితే గాని బాహ్యప్రపంచానికి రాలేని పరిస్థితి వారిది. వాగు నుంచి 5 కిలోమీటర్ల దూరంలో గల పాపంపేట చేరుకుంటేగాని వారికి వాహన సదుపాయం అందుబాటులోకి రాదు. ఏలేరు వాగుపై రోప్ బ్రిడ్జి అయినా నిర్మించాలని పింజరికొండ వాసులు సంవత్సరాల తరబడి కోరుతూనే ఉన్నారు.

గన్నేరు చెట్టు పడి వ్యక్తి మృతి

మరో ఇద్దరికి గాయాలు



బొంజుబాబు మృతదేహం

హుకుంపేట: కాఫీతోటలో గన్నేరు చెట్టు నరకడంతో ఆ చెట్టు, వారి మీద పడి ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తడిగిరి పంచాయితీ పాదిలి గ్రామానికి చెందిన కాకారి బొంజుబాబు(40) అన్నదమ్ములతో తమ కాఫీ తోటలో భారీగా పెరిగిన గన్నెరుచెట్టును నరికేందుకు గురువారం తోటకు వెళ్లారు. అయితే ఆ చెట్టు కాకరి బొంజుబాబు తలపై పడి బలమైన గాయమైంది. తనతో పాటు కాకరి కామరాజు, సత్యారావులపై చిన్నకొమ్మలు పడడంతో వారు కూడా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించి హుటాహుటీన గాయపడ్డ వారిని పాడేరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బొంజుబాబుకు తలపై తీవ్ర రక్తస్రావం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయలైన తమ్ముళ్ళు అన్నయ్య మరణవార్త విని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడు బొంజుబాబుకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు

- 29 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

రాజవొమ్మంగి: జిల్లావ్యాప్తంగా రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ రైతుల నుంచి 29 వేల మెట్రిక్ టన్ను ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 56 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. వీటిలో 44 కేంద్రాలను రంపచోడవరం డివిజన్‌లో ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. వచ్చేనెల రెండో వారం నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పారు. ధాన్యం మద్దతు ధర 75 కిలోల బస్తాకు రూ.1530 కాగా, గ్రేడ్‌-1 రకానికి రూ. 1545గా నిర్ణయించినట్టు చెప్పారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ముందస్తుగా ఐదు వేల గోనె సంచులు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద ఒక టెక్నికల్ అసిస్టెంట్, ముగ్గురు వలంటీర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఒక వలంటీర్ సహాయకుడిగా పనిచేస్తాడన్నారు. గింజల నాణ్యత పరిశీలించే సమయంలో ఒక ఫొటో, లారీలోడు పూర్తియిన తరువాత వాహనంతో పాటు రైతు, వలంటీర్లు కలసి తీసుకొన్న మరో ఫొటో తీసి ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌కు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోని జగ్గంపేట, పెద్దాపురం, కోరుకొండ, రాజమహేంద్రవరం, మండపేట, జగ్గంపేట తదతర చోట్ల గల మిల్లులను ట్యాగ్ చేస్తున్నామన్నారు. అనంతరం మండలంలోని చెరకుంపాలెం గ్రామంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకానికి రైతులు సహకరించాలని ఆయన కోరారు. సర్వేను పర్యవేక్షించారు. సర్వేయర్లకు, వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. సర్పంచ్ దాసరి నాగేశ్వర్రావు, జెట్పీటీసీ ఒడుగుల జ్యోతి, సొసైటీ చైర్మన్ శింగిరెడ్డి రామకృష్ణ, పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యారు. జేసీ వెంట సివిల్ సప్లయాస్ డీఎం గణేష్‌కుమార్, స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.



రాజవొమ్మంగి వచ్చిన జేసీ శివ శ్రీనివాస్‌తో సివిల్ సప్లయి డీఎం గణేశ్‌కుమార్

పిడుగుపాటుకు పశువుల మృతి



పిడుగుపాటుకు బాబుశాలలో మృతి చెందిన పశువులు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల బాబుశాల పంచాయతీ కేంద్రంలోని కొండప్రాంతంలో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు 3 పశువులు మృత్యువాత పడ్డాయి. పశువులకాపరులు మేత కోసం కొండ ప్రాంతానికి తీసుకువెళ్లి సాయంత్రం గ్రామానికి తీసుకు వస్తున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పశువులు ఉన్న ప్రదేశంలో పిడుగుపడడంతో అవి స్పృహ కోల్పోయి, మరలా లేచి తిరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పశువులను గ్రామానికి తీసుకువచ్చి చూడగా మూడు పశువులు రాకపోవడంతో గురువారం ఉదయం కొండ ప్రాంతానికి వెళ్లి వెతికగా మృతి చెంది ఉన్నాయి. పశువుల మృతితో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

పశువ్యాధులపై అప్రమత్తం

పశు సంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్



పశువులకు వైద్యం అందిస్తున్న ఏడీ చంద్రశేఖర్

చింతపల్లి: పశువులకు సోకుతున్న వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి పశుసంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్ అన్నారు. వ్యాధులు సోకిన పశువులకు గురువారం చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పశువులకు లంపీ స్కిన్ వ్యాధి అధికంగా వ్యాపిస్తున్నట్టు చెప్పారు. వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 10 వేల డోసుల వ్యాక్సిన్ సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లో 2,300 పశువులకు లంపీస్కిన్ నివారణ వ్యాక్సిన్ వేసినట్టు తెలిపారు. పశువుల అక్రమ రవాణకు అడ్డుకట్టు వేసేందుకు సీలేరు, డౌనూరులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వ్యాధులు, నివారణ చర్యలపై పశువైద్య సహాయకులకు ఆర్బీకేల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. పాల కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చౌడుపల్లి, కొత్తపాలెం, లోతుగెడ్డలో కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తిపై కేసు

రాజవొమ్మంగి: వివాహం చేసుకొంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి ఇప్పుడు ముఖం చాటేస్తున్న యువకుడిపై మండలంలోని వాతంగి గ్రామానికి చెంది ఓ ఉద్యోగిని జడ్డంగి స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వీరిద్దరిదీ వాతంగి గ్రామమే. ఎస్‌ఐ షరీఫ్ తెలిపిన వివరాలివి. ఇద్దరు పిల్లల తరువాత ఓ వివాహిత భర్తతో విడాకులు తీసుకొని ఉద్యోగ రీత్యా వాతంగిలో నివాసం ఉంటున్నది. ఒంటరిగా వున్న ఆ మహిళను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు వివాహం చేసుకొంటానని నమ్మించాడు. అయితే ఆ యువకుడు మరో పెళ్లికి సిద్ధపడుతున్నాడని తెలిసిన ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు గురువారం సాయంకాలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వాలీబాల్ విజేత 'ఈకోర్సా'

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ ఆహ్వాన వాలీబాల్ టోర్నీలో ఈకోర్సా వాల్తేర్ జట్టు విజేతగా నిలిచింది. ఫ్లడ్ లైట్ల వెలుతురులో రైల్వే స్టేడియంలో బుధవారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో సీడ్ అకాడమీ జట్టుపై 3-1 సెట్ల తేడాతో విజయం సాధించింది. ఏడు జట్లు ఈ టోర్నిలో తలపడ్డాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర వాలీబాల్ సంఘం అధ్యక్షుడు పి.వి.జి.ఆర్.నాయుడు, డీఆర్‌ఎం అనూప్‌కుమార్‌సత్పతి విజేతలకు ట్రోఫీ అందజేశారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

సబ్ కలెక్టర్ శుభం బన్సాల్

గంగవరం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్ తెలిపారు. నేలదోనెలపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కొండమొదలు సర్పంచ్ యాట్ల విజయ సబ్‌కలెక్టర్‌కు వివరించారు. ప్రధానంగా సీసీ రోడ్లు నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని కోరారు. కొండమొదలు పంచాయతీ నిర్వాసితులు అందుతున్న సౌకర్యాలను సబ్‌కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని గ్రామాలకు చెందిన కుటుంబాలకు పునరావాస కల్పించారు తదితర విషయాలకు ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేలదోనెలపాడు కొండమొదలు-1, కొండమొదలు-2 ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని గృహాలను, ప్రభుత్వ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. గ్రామసచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి మందులను పరిశీలించారు. గిరిజనులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలను అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం కమ్యూనిటీహాల్, జీసీసీ రేషన్ డిపో, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను సూచించారు. మధ్యాహ్నభోజన పథకం అమలు, జగనన్న విద్యా కానుకల పంపిణీ, అమ్మఒడి లబ్ధిదారుల గురించి ఆరా తీశారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీమన్నారాయణ, వీఆర్వో సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



నేలదోనెలపాడు పునరావాస కాలనీలో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ బన్సాల్

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో గ్రామసభ

ముంచంగిపుట్టు: మండలంలోని అత్యంత మారుమూల మావోయిస్టుల ప్రభావిత ప్రాంతమైన బూసిపుట్టు గురువారం సర్పంచ్ కె.రాజమ్మ ఆధ్వర్యంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యలపై గిరిజనులు వినతులు అందించారు. బూసిపుట్టులో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ మేరకు తీర్మానం చేశారు. పంచాయతీ కార్యదర్శి గోపి,సచివాలయ సిబ్బంది,అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు పందిరి రాట

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో గౌరి పరమేశ్వరుల ఉత్సవాలకు గౌరీ సేవాసంఘం శ్రీకారం చుట్టింది.నెలరోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు గురువారం పందిరిరాటకు తొలిపూజలు చేశారు.మోదకొండమ్మతల్లి ఆలయ పూజారి సుబ్రమణ్యశాస్త్రి ప్రత్యేక పూజలు ఆనంతరం డాక్టర్ నరసింగరావు, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, గౌరీసేవా సంఘం కుటుంబాలంతా పందిరిరాటను ప్రతిష్ఠించారు. గ్రామపెద్ద కొట్టగుల్లి సుబ్బారావు,వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ని,కొట్టగుల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పందిరిరాట వేస్తున్న డాక్టర్ నరసింగరావు, సర్పంచ్ ఉషారాణి

ఇంత నాసిరకంగా పనులుంటే ఎలా ?

నాడు-నేడు పనులపై జెడ్పీ చైర్‌పర్సన్ జల్లి సుభద్ర ఆగ్రహం

ముంచంగిపుట్టు: నాడు-నేడు పనులు ఇంత నాసిరకంగా ఉంటే ప్రభుత్వ ఆశయం ఎలా నెరవేరుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గతంలో జరిగిన నాడు-నేడు పనులను ఆమె పరిశీలించారు.పనులు సక్రమంగా జరగకపోవడం,చేసిన పనులు నాసిరకంగా ఉండడం,కొన్ని పనులు అసంపూర్తిగా వదిలేయడంపై హెచ్‌ఎం మాణిక్యాలరావును ప్రశ్నించారు.కాంట్రాక్టర్,ట్రైబల్ వెల్ఫేర్ ఏఈఈ శ్రీకాంత్‌లు ఎన్ని సార్లు చెప్పినా వినకుండా పనులను ఇలా అసంపూర్తిగా వదిలేశారని ఆయన బదులిచ్చారు. కాంట్రాక్టర్,ఏఈఈల విషయాన్ని కలెక్టర్,ఐటీడీఏలకు దృష్టికి తీసుకువెళ్లి, పాఠశాలలో జరిగిన పనులపై విచారణకు ఆదేశిస్తానని, దీనికి హెచ్‌ఎం సైతం పూర్తి బాధ్యత వహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల రికార్డులు పరిశీలించి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేస్తూ,మంచి నడవడిక నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రమేష్,సర్పంచ్‌లు నరసింగరావు,భాగ్యవతి,ఎంపీటీసీ భాగ్యవతి, మల్లికార్జున్ తదితరుల పాల్గొన్నారు.



హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

రాయగడ పాసింజర్ రద్దు

కిరండూల్ ఎక్స్‌ప్రెస్ గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం రాయగడ పాసింజర్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. భద్రతా కారణాల వలన కేకే లైన్‌లో నడిచే కిరండూల్ ఎక్స్‌ప్రెస్ గమ్యం కుదిస్తున్నట్లు పేర్కొన్నారు.

- అక్టోబరు 22వ తేదీన విశాఖపట్నంలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-రాయగడ (08504) పాసింజర్ స్పెషల్, తిరుగు ప్రయాణంలో రాయగడలో అక్టోబరు 23వ తేదీన బయల్దేరాల్సిన రాయగడ-విశాఖపట్నం(08503) స్పెషల్‌ను రద్దు చేశారు.
- అక్టోబరు 25, 26తేదీల్లో విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్ (18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. అక్టోబరు 26, 27 తేదీల్లో కిరండూల్ - విశాఖపట్నం (18513) రైలుగా కిరండూల్ నుంచి కాకుండా, దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది
- అక్టోబరు 26,27 తేదీలలో విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(08552)రైలుగా అక్టోబరు 27, 28 తేదీల్లో కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి, విశాఖపట్నం చేరుకుంటుంది.

ఆదివాసీ బిడ్డలు అన్ని రంగాల్లో రాణించాలి



జి.మాడుగుల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

జి.మాడుగుల: ఆదివాసీ బిడ్డలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు తెలిపారు. జి.మాడుగుల మండల కేంద్రంలో గురువారం ఆయన పర్యటించారు. బంధవీధి, గాంధీనగరం గ్రామాల్లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, గురుకుల కళాశాలలను ఆయన సందర్శించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలు అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోంచాలని కోరారు. ఈ సందర్భంగా రవిబాబును ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. అనంతరం లువ్వాసింగిలో మాజీ అసిస్టెంట్ వీఆర్వో బెదరా కృష్ణారావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, డీడీ కొండలరావు, ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, లిల్లీ, రామలక్ష్మి,వైఎస్ ఎంపీపీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్ పోస్టుల భర్తీలో నకిలీ సర్టిఫికెట్ల కలకలం

- 9 మంది అభ్యర్థుల ఫేక్ సర్టిఫికెట్ల గుర్తింపు
- కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఇటీవల చేపట్టిన విమ్స్ పోస్టుల భర్తీలో అభ్యర్థులు దాఖలు చేసిన సర్టిఫికెట్లలో నకిలీవి బయట పడ్డాయి. అధికారులు చేపట్టిన పునః పరిశీలనలో ఇవి వెలుగులోకి వచ్చాయి. అక్రమంగా ఉద్యోగాలు పొందడానికి పలువురు అభ్యర్థులు చేసిన ప్రయత్నాలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెక్ చెప్పారు. విమ్స్‌లో పోస్టుల భర్తీ కోసం వైద్య ఆరోగ్య శాఖ గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. 18 కేటగిరీల్లో 92 పోస్టులు భర్తీ చేస్తున్నారు. దీంతో భారీగా దరఖాస్తులు వచ్చాయి. అయితే 1:3 నిష్పత్తి కింద మొత్తం 276 మందిని ఇంటర్వ్యూకు ఆహ్వానించారు. ఈ క్రమంలో అర్హత లేకపోయినా అత్యధిక మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉత్తీర్ణులైనట్టు పలువురు నకిలీ సర్టిఫికెట్లు సంపాదించి దరఖాస్తు చేశారు. ఇలా ఎక్కువ మంది అధిక మార్కులు పొందినట్టు ఉండడంతో అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో సర్టిఫికెట్ల పునః పరిశీలన చేపట్టారు. అయితే ఏది నకిలీయో, ఏది అసలు సర్టిఫికేటో తేల్చడం అధికారులకు కష్టంగా మారింది. దీంతో అనుమానం కలిగిన సర్టిఫికెట్లను పారా మెడికల్ బోర్డుకు పంపారు. అక్కడి నుంచి 9 మంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారని వైద్యారోగ్య శాఖ అధికారులకు సమాచారం అందింది. ప్రస్తుతం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సాగుతోంది.



విమ్స్ ఆస్పత్రి

అభ్యంతరాలు పట్టించుకోని ప్రత్యేక అధికారి

పోస్టుల భర్తీలో అభ్యర్థుల నుంచి వస్తున్న వినతులను ప్రత్యేక అధికారి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అభ్యంతరాలు, వినతులు ఇవ్వడానికి వస్తే.. తమ మాటలు వినకుండా ఏదేదో మాట్లాడి గందరగోళానికి గురి చేస్తున్నారని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపు

విమ్స్ పోస్టుల భర్తీలో అనేక మంది నకిలీ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేశారు. ఇలా 9 మంది సర్టిఫికెట్లు నకిలీ అని పారా మెడికల్ బోర్డు నిర్ధారించింది. వారిని మినహాయించి, మిగతా వారితో పోస్టులు భర్తీ చేస్తాం. ఆ అభ్యర్థి తర్వాత ఉన్నవారిని ఎంపిక చేస్తున్నాం. ఏమైనా అభ్యంతరాలు ఉంటే నేరుగా నన్ను కలవచ్చు. అర్హులకు ఎలాంటి నష్టం జరగదు.

– డాక్టర్ కె.విజయలక్ష్మి, డీఎం అండ్ హెచ్‌వో

క్లుప్తంగా

గ్రామాభివృద్ధే లక్ష్యంగా కృషి



మాట్లాడుతున్న సర్పంచ్ రామ్మూర్తి

డుంబ్రిగుడ: గ్రామాభివృద్ధే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ రామ్మూర్తి తెలిపారు. కోల్లాపుట్టు పంచాయతీ కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాక సింహాచలం, ఉప సర్పంచ్ భీమన్న,మల్లేష్, పంచాయతీ కార్యదర్శి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న గాయత్రి, సర్పంచ్ రాంబాబు

జి.మాడుగుల: మండలంలోని జి.మాడుగుల పంచాయతీ చెక్కరాయి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం పాడేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, సర్పంచ్‌ల ఫోరం మండల గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు ప్రారంభించారు. చెక్కరాయి గ్రామంలో 330 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.19లక్షలు మంజూరు చేసింది. ప్రారంభ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

584 పశువులకు వైద్య పరీక్షలు



పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యసిబ్బంది

అరకులోయ రూరల్: మండలంలోని ఇరిగాయి పంచాయతీలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 584 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉరుములు,టిలిగుడ, వలదిపనస,కొత్తవలస తదితర గ్రామాల్లో పశువులకు వైద్య సేవలందించారు. అనంతరం పశు వైద్యాధికారి శ్రీనయ్య మాట్లాడుతూ మూగజీవాలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది అప్పలస్వామి,అప్పలరాజు,ముత్యలమ్మ,సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేర్చొద్దు

ముంచంగిపుట్టు: ఎస్టీ జాబితాలో బోయ వాల్మీకి, బెంతు ఒరియా కులాలను చేర్చరాదని గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ఎం. శ్రీను కోరారు. గురువారం నిర్వహించిన గిరిజన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. గిరిజన చట్టాలు,హక్కులను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్,గిరిజన సంఘం మండల నేతలు గాసిరందొర, నర్సింగ్‌రావుపడాల్,భీమరాజులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

హుకుంపేట: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మండలంలో అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓటు నమోదు పత్రాలు తమ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 2019 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు వచ్చేనెల 7వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

- కొయ్యూరు, అనంతగిరి, రంపచోడవరం మండలాల్లో గడపగడపకు మన ప్రభుత్వం



ఇంటి స్థలం మంజూరు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



గిరిజన మహిళతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సీతపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి

కొయ్యూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. దేశంలోని మరే రాష్ట్రంలో కూడా ఇన్ని పథకాలు అమలు చేయడంలేదని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో సచివాలయ వ్యవస్థ కీలకంగా మారిందని తెలిపారు. డౌనూరు పంచాయతీలో రొబ్బసింగి, నిమ్మలపాలెం, గొప్పువీధి, తులబాబలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా రాష్ట్రాల పాలకులు సచివాలయ వ్యవస్థపై ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రభుత్వంపై కొన్ని దుష్టశక్తులు కుట్రలు పన్నుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 175 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిమ్మలపాలెం పాఠశాలలో ఉపాధ్యాయుడు మురళీ బోధిస్తున్న తీరును పరిశీలించి ప్రశంసించారు. అనంతరం గ్రామంలో పలువురికి ఇళ్ల స్థలాల మంజూరు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.
డౌనూరు ఆశ్రమ పాఠశాలలో రూ.1.18 కోట్లతో చేపట్టిన అదనపు భవన నిర్మాణాన్ని పరిశీలించారు. నాణ్యతాప్రమాణాల్లో రాజీ పడొద్దని ఆదేశించారు. అక్కడ హెచ్ఎం ప్రభుదాస్‌ను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, ఎంపీటీసీలు బి.అప్పారావు, ఎస్.మల్లేశ్వరి,మహిళా విభాగం అధ్యక్షురాలు రాజులమ్మ, సర్పంచ్‌లు పాట్టిక భవానీ, రావుల వెంకటలక్ష్మి, జంపా రాజకుమారి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి
–అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: మారుమూల గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ మారుమూల గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఆర్‌పురం, గుత్తవుగుడ్డి, లీటికివలస, కొత్తవలస, బూసుమామిడి గిరిజన తండాల్లో గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గిరిజనులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీటీసీ మితుల, సర్పంచ్ సన్యాసమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శెట్టి ఆనంద్, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, నాయకులు రామయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిరహిత పరిపాలన సీఎం జగన్‌తోనే సాధ్యం
– ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: అవినీతిరహిత పరిపాలన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఐ పోలవరం సచివాయం పరిధిలోని జాగరంపల్లి, సీతపల్లి–1 గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి రహిత పరిపాలన అందిస్తున్నారన్నారు. జాగరంపల్లి, సీతపల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి గడపను సందర్శించి ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిగా ఉన్నారా, లేదా, సంక్షేమ పథకాలు అందుతున్నాయా వంటి విషయాలపై ఆరా తీశారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు,కుతంత్రాలు పన్నినా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు. కొత్త పెన్షన్లు, ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్‌లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధి నిర్వహణ



శోభన్ బాబు, నవ మోహన్

చింతపల్లిరూరల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తామని మండల సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు వంపూరి శోభన్‌బాబు, కార్యదర్శి కిముడు నవమోహన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా శోభన్ బాబు, కార్యదర్శిగా నవ మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించి మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఇటీవల సచివాలయ ఉద్యోగలను పర్మినెంట్ చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సభ్యులను ఎంపీడీవో సీతయ్య అభినందిచారు.

సారాతో ఇద్దరి అరెస్ట్

పాడేరు రూరల్: సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ కూర్మారావు గురువారం తెలిపారు.హుకుంపేట–పెదబయలు మండలాల సరిహద్దు గన్నేరుపుట్టు–గంపరాయి గ్రామ పరిసర ప్రాంతాల్లో గురువారం రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు 30లీటర్ల సారాతో పట్టుబడ్డారని చెప్పారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

మారేడుమిల్లి : సచివాలయం ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో వీర కిషోర్ అన్నారు. మండలంలోని సున్నంపాడు సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజలు ఏ విధంగా సేవలు అందిస్తున్నారు తదితర వివరాలు ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం భవనాన్ని పరిశీలించారు.

రుణ యాప్‌లపై అప్రమత్తం

రాజవొమ్మంగి: రుణ యాప్‌ల విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ గోపీ నరేంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెంలో సర్పంచ్ బొర్ర బుజ్జమ్మ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యాప్‌ల వల్ల జరుగుతున్న మోసాలను సోదాహరణగా వివరించారు. ఆన్‌లైన్ అప్పుల జోలికి పోవద్దని హితవు పలికారు.

పెద అగ్రహారం పాఠశాలకు టార్పాలిన్



టార్పాలిన్‌ను అందజేస్తున్న అల్లూరి సంఘం సభ్యులు

గూడెంకొత్తవీధి: గూడెం పంచాయతీ పెదఅగ్రహారం పాఠశాలకు అల్లూరి యువ గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు టి.మల్లేష్ రూ.ఐదు వేల విలువైన టార్పాలిన్‌ను అందజేశారు. తమ పాఠశాలకు టార్పాలిన్ అందజేయాలని ఆ పాఠశాల విద్యార్థులు సామాజిక మాధ్యమాల ద్వారా కోరారు. దీనిపై స్పందించిన మల్లేష్ గురువారం మిత్రులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధి బడిమెల సింహాచలం, టీపీ శివ, గ్రామ పెద్దలు గోవిందరావు,మచ్చరాజు, కృష్టారావు బాలరాజు,దేవదాసు పాల్గొన్నారు

టీబీపై అప్రమత్తం

పాడేరు రూరల్ : టీబీపై అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఆస్పత్రులకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు అనుష, లక్ష్మి అన్నారు. ఈదులపాలెం పీహెచ్‌సీలో గురువారం గిరిజనులకు టీబీవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, కఫంతో పాటు రాత్రి పూట జ్వరం రావడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈదులపాలెం ఆస్పత్రిలో 19 మంది గిరిజనులకు కఫం పరీక్షలు నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్లు జి.ప్రశాంత్, కె. సదానందం, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎంలు గాయత్రి, రాజేశ్వరి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

- డీఎల్‌పీవో కుమార్

అరకులోయ/అనంతగిరి: మన్యం అందాలను అందాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎల్‌పీవో కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో టూరిజం, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, పర్యాటక ప్రాంతాల్లో ప్రకృతి అందాలను కాపాడుకునేందుకు అధికారులు, స్థానికులు, పర్యాటకులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, తహసీల్దార్ వేణుగోపాల్, అరకు సీఐ దేముడుబాబు, పెదలబుడు సర్పంచ్ దాస్ బాబు, పద్మాపురం సుస్మిత పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శం



సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న చెట్టి పాల్గుణ

అనంతగిరి: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని ఎస్ఆర్‌పురం పంచాయతీలోని సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం గిరిజనులు, సచివాలయం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ సచివాలయం సేవలను అందించాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ హర్షిత్, ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు, తహసీల్దార్ రాంబాయి, పీఆర్ ఏఈ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: మండలంలో పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపీపీ బందం శ్రీదేవి గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన పందిరిమామిడి – చవిటిదిబ్బలు రోడ్డును పూర్తి చేయాలని కోరారు. మడిచర్ల, పాతగాంధీనగరం, ఈతపల్లి తదితర 30 వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలియజేశారు. అనుమతులు వస్తే పనులు ప్రారభమవుతాయని కలెక్టర్ తెలిపినట్టు ఎంపీపీ అన్నారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల పూర్తికి కలెక్టర్ హామీ ఇచ్చినట్టు ఆమె చెప్పారు.

ఘనంగా సత్యసాయి శోభాయాత్ర



సాయిబాబా భక్తుల ఊరేగింపు



పాడేరులో శోభాయాత్ర

సాక్షి,పాడేరు: సత్యసాయి బాబా అవతార ప్రకటన రోజును పురస్కరించుకుని గురువారం సత్యసాయి గిరిజన సేవాసంఘం ఆధ్వర్యంలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సుండ్రుపుట్టు సాయిబాబా ఆలయం వద్ద సత్యసాయి చిత్రపటంతో కూడిన శోభయాత్ర రథాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి పాడేరు వీధుల మీదుగా హుకుంపేట మండలంలోని గడుగుపల్లి గ్రామం వరకు 15 కిలోమీటర్ల శోభాయాత్ర సాగింది. సత్యసాయి నగర కీర్తనలతో సుమారు 1500మంది ఈ యాత్రలో కాలినడకన పాల్గొన్నారు.గడుగుపల్లిలోని సత్యసాయి గిరిజన సేవా కేంద్రంలో భజనలు చేశారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ ప్రతినిధులు సుబ్బారావు,కె.గణేష్,ప్రతాప్‌కుమార్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భజనలతో ఊరేగింపు

గూడెంకొత్తవీధి: భగవాన్ సత్యసాయి బాబా అవతార దినోత్సవం సందర్భంగా గురువారం సత్యసాయి సేవా సమితి పదాధికారులు రింతాడ నుంచి చౌడుపల్లి వరకు భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఆరు కిలోమీటర్లకు పైగా ఈ ఊరేగింపు జరిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

అడ్డతీగల: మారేడుమిల్లిలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బి.రత్నరాజు తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్హతతో పాటు టెక్నికల్ విద్యార్హత ఉన్న వారికి 15 ప్రైవేటు కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి భజన పోటీలు

జి.మాడుగుల: స్థానిక గాంధీనగర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లా స్థాయి భక్తి గీతాల భజన పోటీలు నిర్వహించనున్నారు. విశాఖపట్నం భీమిలి సద్గురు సేవాశ్రమం, హనుమ ఆశ్రమం ప్రతినిధి సాయిరామ్ స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభిస్తారని భజన పోటీల నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఎం.మత్స్యరాజు, రామానందాచారి,రీమెలి అప్పలరాజు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.15,000, ద్వితీయ బహుమతిగా రూ.10,000, తృతీయ బహుమతిగా రూ.5,000, ఉత్తమ గాయకుడికి రూ.5,000, ఉత్తమ హార్మోనియం వాయిద్యకారుడికి రూ.5.000, ఉత్తమ తబలా వాయిద్యకారుడికి రూ.5,000 చొప్పున నగదు బహుమతులు అందిస్తామని వారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరన్స్/ ట్రీ కటింగ్ జరుపుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏడీ (రూరల్) శ్రీనివాస్ తెలిపారు. చికిలింత, వాతంగి, లోదొడ్డి, చెరకుంపాలెం, మారేడుబాక, వంచంగి, అమీనాబాద్ పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేష్

గూడెంకొత్తవీధి: స్పందనలో వచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎంపీడీవో ఉమా మహేష్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పందనలో ఎలాంటి దరఖాస్తులు వస్తున్నాయన్న విషయాన్ని పరిశీలించాలని సూచించారు. పెద్ద సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఆయుష్మాన్‌భారత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాటి వివరాలను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మురికి గుంతల్లో గంబూసియా చేపల విడుదల

రాజవొమ్మంగి : మలేరియా వ్యాధి నిర్మూలన చర్యల్లో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లోని మురికిగుంటల్లో గంబూసియా చేపపిల్లలను వదిలిపెట్టినట్టు స్థానిక మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని బడదనాంపల్లి, దూసరపాము, సింగంపల్లి, జడ్డంగి, లబ్బర్తి, చీడిపాలెం తదతర గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న నీటి గుంతల్లో మొత్తం 1500 చేపపిల్లలను వదిలిపెట్టామన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

కొయ్యూరు: బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ రాజారావు తెలిపారు. అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విక్రయాలపై నిఘా ఉంచినట్టు చెప్పారు.